
# మాళవిక సంచలనం

**ప్రపంచ 7వ ర్యాంకర్‌కు షాక్**



చెంగ్జౌ (చైనా): భారత యువ షట్లర్ మాళవిక బన్సోద్.. చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో సంచలనం సృష్టించింది. బుధవారం ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో 22 ఏండ్ల మాళవిక.. 26-24, 21-19తో ప్రపంచ ఏడో ర్యాంకర్ అయిన గ్రెగోరియా మరిస్కా (ఇండోనేషియా)ను ఓడించింది. మరిస్కా ఇటీవలే ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించడం గమనార్హం. 46 నిమిషాల పాటు హోరాహోరిగా సాగిన పోరులో మాళవిక మ్యాచ్ ఆద్యంతం పట్టుదలతో ఆడి వరుస సెట్లలో ప్రత్యర్థిని చిత్తుచేసింది. ఇదే టోర్నీలో త్రిసా-గాయత్రి, సుమిత్-సిక్కి, ఆకర్షి కశ్యప్, కిరణ్ జార్జ్ వంటి యువ ఆటగాళ్లు తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టారు.

# కమిందు సెంచరీ

గాలె: స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఆతిథ్య శ్రీలంకను మిడిలార్డర్ బ్యాటర్ కమిందు మెండిస్ (114) శతకంతో ఆదుకున్నాడు. కివీస్ బౌలర్ రూర్కీ (3/54) ధాటికి ఆరంభంలోనే కీలక వికెట్లు కోల్పోయిన లంకేయులు.. కమిందుతో పాటు కుశాల్ మెండిస్ (50) రాణించడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి 88 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 302 పరుగులు చేశారు. మాథ్యూస్ (36), చండిమాల్ (30) భారీ స్కోర్లు చేయడంలో విఫలమయ్యారు. కివీస్ స్పిన్నర్ ఫిలిప్స్ 2 వికెట్లు తీయగా టిమ్ సౌథీ, అజాజ్ పటేల్ తలా ఓ వికెట్ పడగొట్టారు.

*నేటి నుంచి భారత్, బంగ్లాదేశ్ తొలి టెస్టు*

# చెపాక్‌లో చెడుగుడేనా?

**స్వదేశంలో దుర్భేద్యంగా రోహిత్ సేన • పాక్‌పై సిరీస్ గెలిచిన ఊపులో బంగ్లా • 'చిదంబరం' ఎవరికి అనుకూలమో?**

చెన్నై: సుమారు ఆరు నెలల విరామం తర్వాత భారత క్రికెట్ జట్టు సొంతగడ్డపై టెస్టు సిరీస్‌కు సిద్ధమైంది. బంగ్లాదేశ్‌తో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా గురువారం నుంచి చెన్నైలోని ఎం.ఎ. చిదంబరం స్టేడియం వేదికగా తొలి టెస్టు ఆడనుంది. ఈ ఏడాది ఆరంభంలో సొంతగడ్డపై ఇంగ్లండ్‌ను ఓడించిన తర్వాత రోహిత్ సేన ఆడనున్న తొలి టెస్టు ఇదే. త్వరలో న్యూజిలాండ్‌తో రెండు టెస్టులు, నవంబర్ నుంచి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ఆడనున్న నేపథ్యంలో భారత్‌కు బంగ్లాతో సిరీస్ కీలకం కానుంది. మరోవైపు ఇటీవలే పాకిస్థాన్‌ను వారి గడ్డపైనే రెండు టెస్టులలోనూ ఓడించి జోరుమీదున్న బంగ్లా.. భారత్‌కూ షాకిచ్చేందుకు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుని బరిలోకి దిగుతోంది. స్పిన్‌కు అనుకూలించే చిదంబరం స్టేడియంలో ఇరు జట్లలోనూ నాణ్యమైన స్పిన్నర్లు ఉండటంతో ఈ టెస్టు రసవత్తరంగా సాగే అవకాశముంది.

**స్పిన్ ఎలా ఆడతారో?**

గత పదేండ్లలో భారత్‌కు స్వదేశంలో మరే జట్టుకూ లేని తిరుగులేని (40-4) రికార్డు ఉంది. ఈ దశాబ్ది కాలంలో టీమ్‌ఇండియా 4 టెస్టులు మాత్రమే ఓడింది. అయితే జట్టుగా రాణిస్తున్నా బ్యాటర్లు వ్యక్తిగతంగా స్పిన్ ఆడటంలో ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యర్థిని స్పిన్ ఉచ్చులో పడేస్తున్న భారత్.. తాము బ్యాటింగ్ చేసే క్రమంలో అదే ఉచ్చులో చిక్కుకుంటోంది. మరీ ముఖ్యంగా టాపార్డర్ బ్యాటర్ విరాట్ కోహ్లీ.. 2021 తర్వాత స్పిన్‌ను ఎదుర్కోవడంలో తడబడుతున్నాడు. గత 15 టెస్టులలో స్పిన్ ఆడే క్రమంలో అతడి సగటు 30గా ఉండటం ఆందోళనకరం. మిడిలార్డర్‌లో కీలక ఆటగాడైన కేఎల్ రాహుల్ కూడా (23.40) కూడా తడబడుతున్నాడు. కెప్టెన్ రోహిత్‌శర్మ (15 మ్యాచ్‌లలో 44) మాత్రం మెరుగ్గా ఆడుతున్నాడు. యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ ఇంగ్లండ్‌తో సిరీస్‌లో అదరగొట్టినా ఆ జట్టులో పెద్దగా పేరుమోసిన స్పిన్నర్ లేకపోవడం గమనార్హం. గిల్, దాదాపు రెండేండ్ల తర్వాత టెస్టు ఆడుతున్న రిషభ్ పంత్ మిడిలార్డర్‌లో స్పిన్ ఎలా ఆడతారో చూడాలి. బంగ్లా జట్టులో షకీబ్‌అల్ హసన్, తైజుల్ ఇస్లాం, మెహిదీ హసన్ మిరాజ్ వంటి మెరుగైన స్పిన్నర్లు ఉండటంతో వారిని భారత బ్యాటర్లు ఏ మేరకు ఎదుర్కుంటారనేది ఆసక్తికరం. పాకిస్థాన్‌పై సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడంలో ఈ ముగ్గురిదే కీలకపాత్ర. ఇక స్పిన్ ఫ్రెండ్లీ పిచ్ అయిన చెపాక్‌లో తుది జట్టు ఎంపిక కూడా రోహిత్‌కు సవాల్‌గా మారింది. అశ్విన్, జడేజాతో పాటు మూడో స్పిన్నర్‌గా కుల్దీప్‌ను తీసుకుంటారా? లేక యువ పేసర్లు యశ్ దయాల్, ఆకాశ్ దీప్‌లో ఎవరికి చోటిస్తారు? అనేది తేలాల్సి ఉంది. ఒకవేళ ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు పేసర్లతో వెళ్లినా తుది జట్టులోఅక్షర్ పటేల్‌నూ ఆడించే అవకాశముంది. లోయరార్డర్‌లో అతడు ఉపయుక్తకరమైన బ్యాటర్ కానున్నాడు.



ఉ: 9.30 గంటల నుంచి స్పోర్ట్స్-18లో ప్రత్యక్ష ప్రసారం

**27** ఈ ఏడాది భారత్ తరఫున టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా బుమ్రా కొనసాగుతున్నాడు.

**బంగ్లా షాకిచ్చేనా?**

నజ్ముల్

కొద్దిరోజుల క్రితమే పాక్‌ను చిత్తుచేసి చరిత్ర సృష్టించిన బంగ్లా అదే ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. టీమ్‌ఇండియాతో ఆడిన 13 టెస్టులలోనూ ఆ జట్టుకు పరాభవాలే ఎదురవగా భారత్‌లో ఆడిన మూడు టెస్టులలో అయితే భారీ ఓటములే ఎదురయ్యాయి. పేపర్‌పై చూస్తే భారత్ బలంగా కనిపిస్తున్నా బంగ్లాను తేలిగ్గా తీసుకుంటే పప్పులో కాలేసినట్టే. సమర్థవంతమైన స్పిన్నర్లకు తోడు యువ పేసర్ నహిద్ రాణా, హసన్ మహ్మద్ వంటి బౌలర్లు ఆ జట్టు సొంతం. కెప్టెన్ శాంతో, లిటన్‌దాస్, ముష్ఫీకర్ రహీమ్‌తో పాటు షకిబ్, మిరాజ్ వంటి ఆటగాళ్ల రూపంలో ఆ జట్టుకు ఆల్‌రౌండర్లూ ఉన్నారు.

**జట్ల అంచనా:**

**భారత్:** రోహిత్‌శర్మ(కెప్టెన్), జైస్వాల్, గిల్, కోహ్లీ, రాహుల్, పంత్, జడేజా, అశ్విన్, కుల్దీప్, సిరాజ్, బుమ్రా.

**బంగ్లాదేశ్:** నజ్ముల్ హుస్సేన్(కెప్టెన్), షాద్మాన్, జకీర్ హసన్, మోమినుల్, ముష్ఫికర్, లిటన్‌దాస్, షకీబల్ హసన్, మెహదీ హసన్, తస్కిన్ అహ్మద్, హసన్, నహిద్ రాణా/ తైజుల్ ఇస్లాం.

**17** స్వదేశంలో 2012 నుంచి భారత్ వరుసగా 17 టెస్టు సిరీస్ విజయాలు సాధించింది.

# క్రికెట్ సెలెక్షన్స్‌లో అవకతవకలు!

**ఉప్పల్ స్టేడియంలో భువనగిరి ఎంపీ ఆధ్వర్యంలో ఆందోళన**

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో జరుగుతున్న సెలెక్షన్స్‌లో అవకతవకలపై భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆందోళనకు దిగారు. జిల్లాల నుంచి ప్లేయర్లకు సరైన ప్రాతినిధ్యం లేదంటూ తనకు ఫిర్యాదులు వచ్చాయని ఆయన అన్నారు. ఈ క్రమంలో బుధవారం ఉప్పల్ స్టేడియంలో హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజ్‌ను ఎంపీ కలిశారు. ఈ సందర్భంగా సెలెక్షన్స్‌లో చోటు చేసుకుంటున్న అవకతవకలను వివరిస్తూ, హెచ్‌సీఏ ప్రక్షాళన చేయాలని సూచించారు. దీనిపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేస్తానని ఎంపీ హెచ్చరించారు.

**ఎవరా ప్రజా ప్రతినిధి?**

క్రీడాకారుల ఎంపిక అనేది పారదర్శకంగా ఉండాలి. ప్రతిభ ఉన్నవారికే అవకాశం దక్కాలి. అయితే క్రికెట్‌లో పరిస్థితులు భిన్నంగా ఉంటున్నాయి. ప్రతిభ ఉన్నవారిని కాదని.. తమ వారిని పోటీలకు ఎంపిక చేయాలన్న ఒత్తిడి సెలక్షన్ కమిటీపై పెరుగుతోంది. తెలుగు రాష్ర్టాల్లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పాత్ర క్రీడాకారుల ఎంపికలో కీలకంగా ఉండడంతో అనేక మంది హెచ్‌సీఏపై ఒత్తిడి పెంచుతున్నారు. అండర్-16, అండర్-19 సెలెక్షన్లలో తమవారిని ఏదో ఒక పొజిషన్‌లో ఆడించాలని, ఒక్క చాన్స్ అయినా ఇవ్వాలంటూ ఒత్తిడి పెంచుతున్నారు. ఇటీవల రాష్ట్రంలోని ఓ కీలక పార్లమెంటు నియోజకవర్గానికి చెందిన ఎంపీ తన బామ్మర్ది కొడుకు కోసం(మేనల్లుడు) విపరీతంగా పైరవీలు చేశాడు. హెచ్‌సీఏ తన మాట వినకపోవడంతో ఆయన ఏకంగా హెచ్‌సీఏపై లేఖల యుద్ధం చేశాడు. ఫిర్యాదులు చేస్తానని బెదిరించినట్టు తెల్సింది. చివరకు మొత్తం సెలక్షన్ విధానమే లోపభూయిష్టమని, ఇది జరగాల్సిన పద్ధతి ఇది కాదని, అక్రమాలు జరిగాయని కూడా ఆరోపిస్తూ కొంత మందితో ఆందోళన జరిపించేందుకు ప్రయత్నించినట్టు తెలిసింది. ప్రజాప్రతినిధులు తమపై ఇలా ఒత్తిడి తెస్తే ఇక ప్రతిభ ఉన్న ప్లేయర్లను ఎలా ఎంపిక చేసేదని హెచ్‌సీఏ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

# డీఎస్పీ నిఖత్ జరీన్

**బాధ్యతలు స్వీకరించిన స్టార్ బాక్సర్**



హైదరాబాద్, సెప్టెంబర్ 18(నమస్తే తెలంగాణ): ప్రపంచ బాక్సింగ్ చాంపియన్, అర్జున్ అవార్డు గ్రహీత నిఖత్ జరీన్.. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (స్పెషల్ పోలీస్)గా తన జాయినింగ్ రిపోర్ట్‌ను డీజీపీ జితేందర్‌కు బుధవారం అందజేశారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన నిఖత్ జరీన్ బాక్సింగ్‌లో రెండు సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచింది. కామన్వెల్త్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్, ఏషియన్ గేమ్స్‌లో బ్రాంజ్ మెడల్‌ను గెలిచింది. ఇటీవల పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లోనూ ఆమె పాల్గొన్నారు. నిఖత్ జరీన్‌కు డీఎస్పీ ఉద్యోగమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నిఖత్‌కు అడిషనల్ డీజీపీ, ఇన్‌చార్జి పర్సనల్ మహేశ్ భగవత్ శుభాకాంక్షలు తెలిపారు.

# పంజాబ్ హెడ్‌కోచ్‌గా పాంటింగ్



ఢిల్లీ: ఐపీఎల్ ప్రారంభ సీజన్ (2008) నుంచి ఈ లీగ్‌లో ఆడుతున్నా ఇప్పటి దాకా టైటిల్ నెగ్గని జట్లలో ఒకటైన పంజాబ్ కింగ్స్ మరోసారి హెడ్‌కోచ్‌ను మార్చింది. ఆస్ట్రేలియా దిగ్గజ సారథి రికీ పాంటింగ్‌ను తమ హెడ్‌కోచ్‌గా నియమించుకుంది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. పాంటింగ్ నాలుగేండ్ల పాటు పంజాబ్‌కు కోచ్‌గా ఉండేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడని తెలిపింది. ట్రెవర్ బైలిస్ స్థానంలో హెడ్‌కోచ్ బాధ్యతలు చేపట్టనున్న పాంటింగ్‌కు కోచింగ్ సిబ్బంది విషయంలో పంజాబ్ పూర్తి స్వేచ్ఛనిచ్చినట్టు తెలుస్తోంది. గత ఏడేండ్ల పాటు ఢిల్లీ క్యాపిటల్స్‌కు కోచ్‌గా పనిచేసిన పాంటింగ్.. 2025 సీజన్ నుంచి కొత్త ఫ్రాంచైజీకి సేవలందించనున్నాడు.

# సఫారీలకు అఫ్గన్ షాక్

**తొలి వన్డేలో ఘనవిజయం**

షార్జా (యూఏఈ): అఫ్గానిస్థాన్ క్రికెట్ జట్టు సంచలన ప్రదర్శనతో అగ్రశ్రేణి దక్షిణాఫ్రికాకు అనూహ్య షాకిచ్చింది. షార్జా (యూఏఈ) వేదికగా జరుగుతున్న మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం ముగిసిన తొలి వన్డేలో కాబూలీలు 6 వికెట్ల తేడాతో జయభేరి మోగించారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా.. 33.3 ఓవర్లలో 106 పరుగులకే ఆలౌట్ అయింది. వన్డేల్లో అఫ్గన్‌పై సఫారీలకు ఇదే అత్యల్ప స్కోరు. వియాన్ మల్డర్ (52) టాప్ స్కోరర్. ఫరూఖీ (4/35), ఘజన్‌ఫర్ (3/20), రషీద్ ఖాన్ (2/30) దక్షిణాఫ్రికాకు చుక్కలు చూపించారు. అనంతరం అఫ్గానిస్థాన్.. 26 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఫరూఖీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

### కానిస్టేబుల్‌కు డీజీపీ అభినందన



లక్నోలో ఇటీవల జరిగిన ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్ బాక్సింగ్ విభాగంలో బ్రాంజ్ మెడల్ గెలిచిన నాంపల్లి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ వినోద్‌కుమార్‌ను డీజీపీ జితేందర్ అభినందించారు. కార్యక్రమంలో ఐజీపీ (పీ &ఎల్), ఇన్‌చార్జి స్పోర్ట్స్ ఐజీపీ ఎం రమేశ్, స్పోర్ట్స్ డీఎస్పీ రామారావు, కోచ్ నిరంజన్, టీమ్ మేనేజర్ ఎండీ ఇఫ్తేకార్ అహ్మద్ పాల్గొన్నారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.